ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 43.0

కనిష్ఠం : 24.0

డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

■ లోపలి పేజీలో..



లక్ష్మీపురంలోని గొడౌన్ (ఫైల్)

పైలట్ ప్రాజెక్టుగా ఐదు నిర్మాణానికి చర్యలు

రైతులకు.. సహకార గొడౌన్లు

- ప్రస్తుతానికి కొప్పాక సొసైటీ ఎంపిక
- కేంద్రం నుంచి నాబ్ సంరక్షణ పథకం అమలు
- వరి, మొక్కజొన్న, మామిడి ఉత్పత్తుల నిల్వకు రైతులకు భరోసా

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) :

జిల్లాలో రైతులు పండించిన పంటల ఉత్పత్తుల నిల్వకు సహకార సంఘాల ద్వారా భారీ గొడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతీ పంట సీజన్‌లో రైతుల తమ పంటలను నిల్వ చేసుకోవడానికి పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. పంటల్లో నిర్ణీత నిబంధనల ప్రకారం తేమ లేకపోతే వాటిని ప్రభుత్వ ఏజన్సీలు స్వీకరణకు నిరాకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమేర పరపతి ఉన్న సహకార సంఘాల పర్యవేక్షణలో వరల్డ్ లార్జెస్ట్ స్టోరేజ్ ప్లాన్ కింద రైతుల పంటల నిల్వలకు, వాటిని ప్రాసెసింగ్ చేసుకోవ డానికి అనుగుణంగా ఈ గొడౌన్ల నిర్మాణం చేస్తారు.

అక్కడే పంటలు ఆరబోతకు డ్రయింగ్ యార్డులు నిర్మించి, యంత్రాలను అందివ్వనున్నారు. ఒక్కొక్క గొడౌన్‌ను రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మిస్తారు. ఇందులో 15 శాతం సహకార సంఘం భరించాల్సి ఉంటుంది. మిగిలిన 85 శాతం ప్రాజెక్టు వ్యయాన్ని నాబార్డు బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తోంది. ప్రధానంగా ఒకే పంట ఉత్పత్తి చేసే రైతులతో ఎఫ్‌పీవో సంఘాలు ఏర్పాటుకు మరో పక్క సహకార శాఖ శ్రీకారం చుట్టింది. తద్వారా వారి పంటల ఉత్పత్తుల మార్కెటింగ్ అవసరాలు అందిపుచ్చుకోవడంతో పాటు నాబార్డు రుణాలు ఏటా రూ.6 లక్షలు మేర రైతు సంఘాలకు అందనున్నాయి. ఇవి ఏర్పాటయ్యేలోగా గొడౌన్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. మామిడి, మొక్కజొన్న, ఇతర పంటలకు అనువుగా ఈ గొడౌన్లు ఉపయోగపడాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం.

తొలుత ఐదు సొసైటీల్లో నిర్మాణాలు

జిల్లాలో తొలుత ఐదు సొసైటీల్లో వీటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపితే పైలట్ ప్రాజెక్టు కింద వీటిని మంజూరు చేయనున్నారు. తొలుత ఐదెకరాల స్థలంలో కొప్పాక సొసైటీని ప్రస్తుతానికి ఎంపిక చేశారు. మిగిలిన నాలుగు ఎక్కడనేది స్థలాల అన్వేషణ జరుగుతోంది. దీనిపై జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది రైతులకు మంచి సదవకాశమన్నారు. రైతులు పంటలను నేరుగా ఈ గొడౌన్‌లోకి తీసుకొచ్చి, అక్కడ నిల్వ చేసి, వాటిని ఆరబెట్టి గిట్టుబాటు ధర వచ్చినప్పుడు సకల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

బాణసంచా కేంద్రాల్లో భద్రత కరువు

- గాలిలో దీపంలా కూలీల ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు
- కనీస ప్రమాణాలు పాటించని వ్యాపారులు

■ లోపలి పేజీలో..



భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



దెందులూరు మండలం గోపన్నపాలెంలో..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఈత మట్టలతో ప్రదర్శనలు నిర్వహించారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని మత పెద్దలు ఉద్బోధించారు.



ముదినేపల్లిలో..

ఓపెన్ ఇసుక రీచ్‌లు ఇంకెప్పుడు?



కుక్కునూరు మండలంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇసుక నిల్వలు (ఫైల్)

ఇసుక లభ్యత కోసం ఎదురుచూపులు

- భవన నిర్మాణ కూలీలకు కష్టకాలం
- వర్షాకాలంలో అందరికీ తిప్పలే..

జిల్లాలో ఓపెన్ ఇసుక రీచ్‌ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. పొరుగున పశ్చిమ, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇసుక రీచ్‌ల్లో దండిగా ఇసుక లభ్యం అవు తుండగా, ఏలూరు జిల్లాలో ఇసుకకు పాట్లు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో మేజర్ రీచ్‌లు 16 ఉండగా, గతంలో ఇసుక నిల్వలతో కూలీలకు చేతి నిండా పనులు, అటు నిర్మాణాలకు ఢోకా లేకుండా ఉండే ది. ఈ ఏడాది ఇసుక రీచ్‌లు గుర్తింపే ఆలస్యం కాగా.. వాటికి ఇంకా అనుమతులు రాకపోవడంతో జిల్లాపై తీవ్ర ప్రభావం పడనుంది.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

గోదావరి నది పరీవాహక ప్రాంతంలోని కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, దాచారం, వింజరంల్లోను, వేలేరుపాడు మండలంలో రుద్రమకోట-1,2 పాయింట్లను కలిపి మొత్తం ఐదు ఇసుక ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేయడానికి అంచనాలను ఫిబ్రవరిలోనే జిల్లా యంత్రాంగం పంపినట్టు సమాచారం. ఈ మేరకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు, గ్రౌండ్‌వాటర్ డిపార్టుమెంట్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు ఇసుక రీచ్‌ల కోసం సాంకేతిక మంజూరు కోసం విజయవాడలోని ఎన్‌ఫోర్సుమెంట్ శాఖకు నివేదించారు. ఇది జరిగి నెలా 15 రోజులు కావొస్తున్న ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఐదు రీచ్‌ల నుంచి మొత్తం 3.58 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనాలు వేశారు. అదీ కాస్తా జాప్యం అవుతోంది. ఇప్పటికే ఏప్రిల్‌లో 15 రోజుల గడిచిపోయాయి. భారీగా నిల్వ చేస్తేగానే మే నెలకు సరిపడా అవసరాలకు అందివ్వలేరు. ఇది కాక వర్షాకాలంలో పనులకు కూడా ఇప్పుడే నిల్వలు సిద్ధం చేయాల్సి ఉంది. అటు ప్రజల ఇళ్లకు, ప్రభుత్వం నిర్మించే ఇళ్లకు, ప్రభుత్వ నిర్మాణాలకు ఓపెన్ రీచ్‌లే ఆధారం కానున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రజలు వాగులు, వంకల్లో లభ్యమయ్యే ఇసుకను ఎడ్లబండ్లు, కూలీలు ద్వారా తెప్పించుని పనులకు వాడుకుంటున్నారు. ఇక ఇసుక డిపోల్లోను, బయట అమ్మకాలు చేయడం లేదు. ప్రధానంగా ఏలూరు, నూజివీడు, ఉంగుటూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో ఇసుక అందక అవస్థలు పడుతున్నారు. పది టైర్ల లారీ ఇసుకను వాస్తవంగా రూ.10 వేలకు లభ్యం కావాల్సి ఉండగా, తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పురుషోత్తమపల్లి, అరికిరేవులు, ప్రక్కిలంకల నుంచి అదనంగా రూ.3 వేల నుంచి రూ.5వేలు పెట్టి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ఏలూరు నగరంలో స్థానికంగా రెండు జూట్‌మిల్లుల మూత పడటం వల్ల ఆ పనులు చేసే కార్మికులు మేస్త్రీల వద్ద కూలీలు, ఇతర భవన, వడ్రంగి, రాడ్ బెండింగ్ రంగాల్లోకి వెళ్లిన వారు కొద్దికాలంగా ఇసుక లభ్యత లేక పనుల్లేక అవస్థలు పడుతున్నారు.

కార్మికులు ఇబ్బంది పడుతున్నారు



జిల్లా అవసరాలకు ఇసుకను యంత్రాంగం రీచ్‌లను తెరిచి ఉంచాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ గుర్తించిన రీచుల్లో ఇసుక సరఫరా కావడం లేదు. ఏలూరులో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణాలపై ఆధారపడి 18 రకాల వృత్తుల వారికి జీవనోపాధికి ఆటంకంగా ఉంది.

- బండి వెంకటేశ్వరరావు, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు

నిండుకున్న డిపోల్లో నిల్వలు

తెలుగుదేశం ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ అమలు ప్రారంభించిన తర్వాత ఇబ్రహీంపేట, చేబ్రోలు, వింజరం డిపోల నుంచి ఉచిత ఇసుకను జిల్లా అవసరాలు వాడారు. ఇక్కడ ఇసుక నిల్వలు అడుగంటే స్థాయికి చేరాయి. కొద్ది నెలలు నుంచి మట్టి కలిసి ఉండటం వల్ల చేబ్రోలు ఇసుకను తీసుకోవడం లేదు. వింజరం వద్ద ఇంకా 1,190 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఈ మూడు డిపోల ద్వారా ఇప్పటి వరకు 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను పలు అవసరాలకు తరలించుకున్నారు. కాగా గత నెలరోజుల క్రితం నుంచి జిల్లాలో పోలవరం మండలం పట్టిసీమ డీ సిల్టేషన్ (నది లోపల పేరుకున్న) ఇసుక పాయింట్ నుంచి గూటాల-1 గూటాల-2 నుంచి ప్రజలకు ఇసుకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది కూడా ఖర్చుతో కూడిన పని కావడంతో ఇసుకను తరలించుకోవడానికి పెద్దగా ఇష్టత చూపడం లేదు. పొరుగు జిల్లా అయిన తూర్పుగోదావరి నుంచి ఏలూరు, పశ్చిమ జిల్లా అవసరాలకు అక్కడ రీచ్‌ల్లో లభ్యమయ్యే ఇసుక కేటాయింపులు జరగాల్సి ఉంది. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తే రాబోయే కాలంలో ఇసుక కొరతను అధిగమించవచ్చు. వర్షాకాలానికి సరిపడా నిల్వలు సిద్ధం చేసుకోవచ్చు.

పోలీసుల ముందస్తు భద్రతా చర్యలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందస్తు చర్యలను పోలీస్‌శాఖ చేపట్టింది. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహ కమిటీ నాయకులతో పోలీసులు సమావేశాలను ఆదివారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం నిర్వహిస్తున్న సందర్భంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీలకు విగ్రహ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇతరులకు భంగం వాటిల్లకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జయంతోత్సవాలు నిర్వహించుకోవా లని సూచించారు. పోలీస్ శాఖ తరపున యువతకు సమాజంలో శాంతి సౌభా తృత్వం పట్ల నిబద్ధంగా వ్యవహరించాలన్నారు. అన్ని కార్యక్రమాలు నిబంధన లకు లోబడి నిర్వహించుకోవాలన్నారు.

గురుకుల పరీక్షలు ప్రశాంతం

చింతలపూడి/భీమడోలు ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేరేందుకు ఐదవ తరగతి, ఇంటర్ జూనియర్ తరగతుల్లో చేరడానికి నిర్వహించిన ప్రవేశపరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. చింతలపూడి, భీమడోలు మండలం పోలసానిపల్లిలో నిర్వహించిన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షలు రాశారు. చింతలపూడిలోని కేంద్రంలో ఐదవ తరగతికి 475 మంది, ఇంటర్మీడియ ట్‌కు 413 మంది పరీక్షలు రాసినట్టు కళాశాల ప్రిన్సిపల్ కిశోర్ తెలిపారు. భీమడోలు మండలం పోలసానిపల్లి గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు 162 మంది విద్యార్థులు, ఇంటర్‌కు 181 మంది పరీక్షలకు హాజరైనట్టు చీఫ్ సూ పరింటెండెంట్‌గా బి.వి.రమణ, ఎస్.పి.మీనాక్షి, ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఈదురు గాలులు.. భారీ వర్షం



ఏలూరు-వట్లూరు రోడ్డుపై విరిగిపడిన చెట్టు



మునునూరు రహదారిపై వర్షపు నీరు

కైకలూరు రైల్వేస్టేషన్‌లో పూరి ఎక్స్‌ప్రెస్‌పై విరిగిపడిన చెట్టు

ఏలూరు/మునునూరు/ కైకలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రమే చిన్నపాటిగా మొదలైన వర్షం ఆపై జోరందుకుంది. భారీ ఈదురుగాలులకు చెట్లు విరిగిపోయి విద్యుత్ లైన్లు ధ్వంసం కావడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. ఏలూరు- వట్లూరు మధ్య రోడ్డుపై చెట్టు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మునునూరు మండలంలో మామిడి కాయలు నేలరాలాయి. పొగాకు పందిళ్లు సైతం తడిసి ముద్దయ్యాయి. చింతలపూడి, లింగపాలెం, ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో భారీవర్షం పడింది. కైకలూరు రైల్వేస్టేషన్‌లో చెట్టు విరిగిపడడంతో ఆదివారం రాత్రి 8:45 గంటలకు తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల పాటు నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో రెండో ప్లాట్ ఫామ్‌పై నరసాపూర్ నుంచి చర్లపల్లి వెళ్లే స్పెషల్ ట్రైన్ కూడా నిలిచిపోయింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది యుద్ధప్రాతిపదికన విరిగిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిం చారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు.





కైకలూరులో పూరి ఎక్స్‌ప్రెస్‌పై విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం..విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు

మొగల్తూరు మండలం ముత్యాలపల్లి వద్ద నేలరాలిన మామిడి కాయలు



జన్మతః దేశభక్తురాలు

కృష్ణభారతికి మంత్రి నిమ్మల నివాళి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, కృష్ణభారతి చిత్రపటం వద్ద కలెక్టర్ నాగరాణి నివాళి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లి గర్భంలో ఉండగానే పసల కృష్ణభారతి స్వాతం త్ర్యోద్యమంలో భాగస్వామి అయ్యారని, జైల్లోనే పుట్టడం ద్వారా జన్మతః దేశభక్తురాలు అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధురాలు, గాందేయవాది పసల కృష్ణభారతి సంస్మరణ సభ ఆదివారం తాడేపల్లిగూడెంలో కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటం వద్ద గాంధే యవాదులు, నాయకులు, అధికారులు నివాళులర్పించారు. సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న సందర్భంలో పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతులు చెరశాలలో ఉన్నప్పుడు జన్మించిన కృష్ణ భారతి గాంధేయ వాదిగా, సంఘసంస్కర్తగా, ఆధ్యాత్మికవేత్తగా ఆదర్శ జీవితం సాగించారని కొనియాడారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కృష్ణ భారతి నిరాడంబర జీవితం గడిపిన ఆదర్శ మూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కె.అప్పల నాయుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఐజేయూ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్, బుద్దాల రామారావు, భోగిరెడ్డి ఆదిలక్ష్మి తదితరులు కృష్ణభారతి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.

నేటి నుంచి జూన్ 15 వరకు చేపల వేట నిషేధం

నరసాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేట నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. జూన్ 15 వరకు అంటే 60 రోజులు పాటు చేపల వేట నిషేధం అమలులో ఉంటుందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బోటు నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. వేటకు వెళ్లిన బోట్లన్ని తీరానికి చేరుకుంటున్నాయి. సముద్రంలో ఉన్న బోట్లకు అంతర్వేది లైట్ హౌస్ నుంచి వైర్‌లైస్ సెట్‌ల ద్వారా సమాచారం ఇస్తున్నారు. 60 రోజల పాటు 1,780 మంది మత్స్యకారులకు ఉపాధి ఉండదు. ఐస్ ఫ్యాక్టరీ, మత్స్య ఎగుమతి కంపెనీ కార్మికులు, లారీ డ్రైవర్లు కూడా తాత్కాలికంగా ఉపాధి కోల్పోనున్నారు. నెలకు రూ.15 నుంచి రూ.20 కోట్లు మత్స్య సంపద ఎగుమతులు నిలిచిపోనున్నాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు దేశవ్యాప్తంగా సముద్ర వేటను కేంద్ర ప్రభుత్వం నిలిపివేస్తుంది. ఈ రెండు నెలల కాలంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరుగుతుంది. ఈ సమయంలో వేట సాగిస్తే మత్స్య సంపద హరించిపోతుందని, ముందస్తు జాగ్రత్తతో వేట నిలిపివేస్తారు.

ఆక్వా రైతులకు ప్రభుత్వం అండ

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- ఉండిలో ఉమ్మడి జిల్లా ఆక్వా రైతుల సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, వేదికపై ఎంపీ బీద మస్తాన్‌రావు, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, కలెక్టర్ నాగరాణి

ఉండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆంక్షలతో ఆక్వా రైతులు ఆందో ళన చెందనవసరం లేదని, మన ప్రాంత ఆక్వా ఉత్పత్తులకు ప్రపంచ దేశాల్లో డిమాండ్ ఉందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండిలో ఆదివారం జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సుస్థిరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో చర్యలు చేపడతామని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మనదేశం లో ఆక్వా రైతులు పండించిన రొయ్యలు ఏదేశంవారికైనా అవసరమేనన్నారు. ఎన్నో దేశాలు మన రైతులు పండించిన రొయ్యలు కావాలని ఎగబడుతున్నా రన్నారు. పంట పండినప్పుడు రొయ్యల ధర తగ్గుగుతందని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టవలసివుందన్నారు. తాను సీఎం దృష్టికి తీసుకుని వెళతానని ఆయన తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ని యోజకవర్గంలో రు.80లక్షలతో ఆక్వా లేబొరేటరీని ఏర్పాటుచేయడం అభినందనీ యమన్నారు. ఉండి కేవీకేలో ఆక్వా ల్యాబ్‌ను ఆధునీకరిస్తామన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు మంచి రోజులు రానున్నాయన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆక్వా రైతుల సదస్సులో వచ్చిన సమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతానని తెలిపారు. ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆక్వా రైతుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ అధునాతన ఆక్వా ల్యాబ్‌లు రావాలన్నారు. ప్రస్తుతం రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం వచ్చిందని, సమస్యలు పరిష్కార మవుతాయన్నారు. సదస్సులో ఆక్వా రైతులు గాదిరాజు సుబ్బరాజు, వేగేశ్న సత్య నారాయణరాజు, నంబూరి గజపతిరాజు, తాడినాడ బాబు, గాంధీభగవన్‌రాజు, తులసి రాంబాబు, కునాథరాజు మురళీకృష్ణంరాజు, ముత్యాల రత్నం, రుద్రరాజు యువరాజు, మత్స్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలో వివాదం

కర్రలతో కొట్టుకున్న ఇరువర్గాలు

■ లోపలి పేజీలో..


క్యూలైన్లలో భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తులతో కళకళలాడిన వెంకన్న, గుబ్బల మంగమ్మ ఆలయాలు

గోవిందుని నామస్మరణతో శ్రీవారి క్షేత్రం మార్మోగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తజనులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది. దాదాపు 12 వేల మంది వరకు స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దర్శనానంతరం భక్తులు ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

\- ద్వారకాతిరుమల

జై.. గుబ్బల మంగమ్మ తల్లీ..

వనదేవత శ్రీగుబ్బల మంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను చేశారు. వరుసగా గతంలో ఆదివారం రోజున పండుగలు రావడంతో ఈ వారం సుమారు ఆరు వేల మంది భక్తులు వచ్చారని అధికారులు అంచనా వేస్తున్నారు.

\- బుట్టాయగూడెం


ఆలయం వద్ద భక్తులు

సరిపల్లి క్రికెటర్‌కు భలే ఛాన్స్

- ఇండియా తరపున నేపాల్‌లో ఆడే అవకాశం
- విశాఖ ప్రైవేట్ స్పోర్ట్స్ క్రికెట్ అసోసియేషన్ ఎంపిక


క్రికెట్ కప్పుతో మాధుర్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : సరిపల్లి గ్రామానికి చెందిన వెలిగట్ల శ్రీవెంకట నాగ మాధుర్‌కు భారత్ తరపున నేపాల్‌లో ఆడే అవకాశం దక్కింది. అండర్-19 క్రికెట్ జట్టును విశాఖకు చెందిన ప్రైవేట్ స్పోర్ట్స్ క్లబ్ నాన్‌సైయిడ్ క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసింది. 15 మందితో కూడిన జట్టులో మాధుర్‌కు స్థానం దక్కింది. ఈనెల 26 నుంచి మే 31 వరకు నేపాల్‌లో జరిగే ఇంటర్నేషన్ ఇండో- నేపాల్ సిరీస్‌లో ఏపీ తరపున ఆడనున్నారు. ప్రస్తుతం నరసాపురంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న యువకుడు ఇప్పటివరకు మూడుసార్లు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-16, 18 జట్ల తరపున పోటీల్లో పాల్గొన్నాడు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి కాగా, తండ్రి బాలాజీ చిన్నపిల్లలకు క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్నారు.

ఇండియా టీమ్‌లో ఆడడమే లక్ష్యం

యువకుడు స్పందిస్తూ ఈ అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. అక్కడ మెరుగైన ఆటతీరు కనబరిస్తే రాష్ట్ర జట్టు, రంజీల్లో స్థానం వస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని క్రికెట్‌లో రాణించేందుకు ప్రయత్నిస్తా. తన క్రీడాభివృద్ధికి నా తండ్రి బాలాజీ, ప్రిన్సిపాల్ రాజన్ ప్రోత్సాహం ఉంది. ఎప్పటికైనా ఇండియా టీమ్‌లో ఆడాలన్నదే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా జైన్ యూత్ క్రికెట్ క్లబ్, నరసాపురం యూత్ క్రికెట్ క్లబ్‌తో పాటు పలు క్రికెట్ అసోసియేషన్లు ఆదివారం అభినందించాయి.


ఉత్తమ ఫలితాలు సాధించిన తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం

తణుకు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తణుకులోని తిరుమల జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470కి466 మార్కులు తొమ్మిది మంది విద్యార్థులు వి.ఆర్. అభినయ, డి.శ్రీవల్లి, బి.ఎల్.సాయికుసుమ, ఎస్.లావణ్య, జె.లలితా దేవి, సీహెచ్.వి.సాయి ప్రజ్ఞ, డి.జి.వి దుర్గామల్లిక, పి.ఎల్.కె.సాయి సౌమ్య, కె.నాగ గాయత్రి సాధించారని 465 పైన 23 మంది, 460పైన 98 మంది, 450పైన 188 మంది, 400పైన 285 మంది విద్యార్థులు సాధించి, 99.5శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 440కి 435 మార్కులు ఎం.సజ్మ ఆర్పా సాధించారని, 434 మార్కులు డి.అశ్రిత శ్రీదుర్గ, 430పైన 14మంది, 400పైన 25మంది విద్యార్థులు సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ తిరుమలరావు అభినందించారు. కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాదు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

పీఆర్ డిప్లొమా ఇంజనీర్లపై కేసులు ఉపసంహరించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్ డిప్లొమా ఇంజనీర్లపై గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు దిగిందని ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ పనులపై విజిలెన్స్ నివేదికలు తయారుచేసి కేసులు పెట్టి ఉపసంహరించుకుందని, ఇంకా మిగిలిన ఎనిమిది జిల్లాల ఇంజనీర్లపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర కోరారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ అధ్యక్షతన సంఘ రాష్ట్ర స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018-19లో చేపట్టిన 25వేల కిలో మీటర్ల రోడ్లు నిర్మించగా వైసీపీ ప్రభుత్వం చేసిన పనులకు చెల్లింపులు ఆపాలనే ఉద్దేశంతో విజిలెన్స్ కేసులు బనాయించిందన్నారు. చేసిన పనులపై ఏసీబీ శాఖతో విచారణ చేసి ఇంజనీర్లపై కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం ఎనిమిది జిల్లాల ఇంజనీర్లపై కేసులు ఉపసంహరిస్తామని మంత్రి పవన్‌కల్యాణ్ కేసులు ఎత్తేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం కార్యదర్శి జి.వెంకటరెడ్డి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాలాజి బోసుబాబు, బి.శ్రీనివాసమూర్తి, ఎ.రాంబాబు, ఎ.చంద్రునాయుడు, విజయకుమార్, పి.శ్రీనివాసరావు, పలు జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కూల్‌కూల్‌గా ప్రయాణం

చాట్రాయి : చాట్రాయి మండలం చిత్తపూరు- కొండపర్వ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు బాగా పెరిగి చివర్లు కలిసిపోయి గొడుగుల్లా తయారయ్యాయి. సుమారు అర కిలోమీటరు దూరం వున్న ఈ రహదారిలోనే చాట్రాయి మండల ప్రజలు నూజివీడు, విజయవాడ వెళ్తుంటారు. వేసవి కాలంలో ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించేవారు కొద్దిసేపు ఇక్కడ ఆగి సేదతీరి వెళుతున్నారు.


చిత్తపూరు-కొండపర్వ మధ్య రహదారికి ఇరువైపులా చెట్లు

అత్తిలి కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అత్తిలి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం గుమ్మంపాడు, బల్లిపాడు గ్రామ శివారు కాలువలో కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేక పోవడంతో కాలువలోకి స్నానానికి దిగి మృతి చెందాడా లేక ఏవిధంగా చనిపోయాడనేది తెలియాల్సి ఉంది. సుమారు 60 ఏళ్ల వయస్సు, చామన చాయ రంగుతో ఉన్నాడు. అత్తిలి పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కనీస వసతులు, భద్రత లేమితో బాణసంచా తయారీ, దుకాణాలు, గోదాముల్లో కూలీల ప్రాణాలు గాలిలో దీపంలా మారిపోతున్నాయి. పొట్టకూటి కోసం పనికి వెళ్తున్న కూలీల ప్రాణాలకు కనీస బీమా లేకపోవడంతో వందలాది మంది కూలీల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తాజాగా అనకాపల్లి జిల్లాలోని కైలాస పట్నంలో ఎనిమిది మంది కూలీలు బాణ సంచా దుకాణం వద్ద అగ్ని ప్రమాదంతో ప్రాణాలు వదిలిన ఘటనతో పశ్చిమ గోదావరి జిల్లాలోని బాణాసంచా ప్రమాద ప్రభావిత కుటుంబాలు ఉలిక్కి పడ్డాయి. జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, దుకాణాల వద్ద వసతులు కల్పించకపోవడంపై ఆంధ్రజ్యోతి కథనం.

తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో రెండేళ్ల క్రితం బాణసంచా తయారీ కేంద్రం వద్ద గంధకం వాడకం వద్ద ఎక్కువ కావడంతో ఒక్కసారిగా విస్ఫోటనం రావడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు తునాతునకలై తల ఒక చోట, చేతులు ఇంకోచోట చెల్లా చెదురుగా పడి మృతి చెందారు. వారి శరీర అవయవాలు వెతుక్కుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తణుకు మండలం దువ్వ వద్ద చిచ్చుబుడ్ల రాపిడి వల్ల నిప్పురవ్వలు ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన భార్య భర్తలు మృతి చెందగా ఆ కుటుంబం నిరాదరణకు గురైంది.


దువ్వ సమీపంలో బాణసంచా దుకాణం వద్ద అగ్నిప్రమాదం (ఫైల్)

బాణసంచా కేంద్రాల్లో భద్రత కరువు !

- కూలీల ప్రాణాలకు ముప్పు
- పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :

బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద ఉండాల్సిన కనీస సదుపాయాలు లేక ప్రమాదాల బారిన పడుతున్నాయి. కనీసం విద్యుత్ సరఫరా కూడా ఉండకూడదనే నిబంధన ఉన్నా దాన్ని అంతా బేఖాతరు చేస్తుంటారు. దానికి తోడు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించే పరికరాలు తూతూమంత్రంగా ఏర్పాటు చేయడం, ప్రమాదం సంభవించినప్పుడు ఏం చేయాలో సిబ్బందికి కనీస అవగాహన ఉండదనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తూ తరచూ సంభవించే అగ్ని ప్రమాదాల వల్ల పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జిల్లాలో చాలానే జరిగాయి.

కూలీలకు బీమా కరువే..

బాణసంచా దుకాణాల వద్ద నిప్పుతో చెలగాటం ఆడాలని కూలీలకు తెలిసినా పొట్టకూటి కోసం తెగించి పనులు చేస్తుంటారు. కూలీలకు కనీసం బీమా కట్టకుండా గాలికి వదిలేస్తుండటం బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు నిబద్ధతకు అద్దం పడుతోంది. అధికారులైనా తప్పనిసరిగా ప్రమాద నివారణ ఎక్విప్‌మెంట్ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత తీసుకునేలా జాగ్రత్తలు పాటించాలి. కూలీలకు బీమా సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

కనీస ప్రమాణాలు పాటించని వ్యాపారులు

జిల్లాలో అనుమతి ఇవ్వకున్నా..

గతేడాది దీపావళికి బాణసంచా తయారీ కేంద్రాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో లైసెన్స్‌లు ఇవ్వకపోవడంతో వ్యాపారులు సరిహద్దు రాజకీయాలు చేసి మరీ వ్యాపారాలు సాగించారు. పశ్చిమ గోదావరి జిల్లా దువ్వ సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా సూర్యారావుపాలెం వద్ద బాణసంచా తయారీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆ కేంద్రం వద్ద అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు మృతి చెందడం చర్చనీయాంశమైంది.

పేలుడు ఘటనలు ఇలా..

బాణసంచా తయారీ కేంద్రాల్లోనే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగాయి. అత్యంత భయంకరంగా ఉంగుటూరు మండలం వెల్లమిల్లి ఘటనలో పటాసుల తయారీలో గంధకం వాడకం ఎక్కువగా ఉండడంతో పేలుడు సంభవించి ఏకంగా ఎనిమిది మంది మృతి చెందగా పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. అప్పట్లో ఈ ఘటన ఓ సంచలనం. ఆ తరువాత తాడేపల్లిగూడెం పడాలలో మరో ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో జరిగిన అగ్నిప్రమాదంలో గంధకం వాడకం ఎక్కువగా ఉండడంతో చిచ్చుబుడ్ల తయారీలో నిప్పుకనికలు ఏర్పడి ముగ్గురు కూలీలను బలితీసుకున్నాయి. దువ్వలో బాణసంచా తయారీ కేంద్రంలో ముగ్గురు, కానూరులో సీమటపాకాయల పేలుడు ఘటనలో ముగ్గురు, గతేడాది దువ్వ సమీపంలోని తూర్పు గోదావరి జిల్లా సూర్యారావుపాలెం వద్ద దీపావళి ముందు బాణసంచా దుకాణం వద్ద పిడుగుపడి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటనలు అన్నీ నిర్లక్ష్యం వల్లే జరిగాయనడానికి నిదర్శనం.

అన్నింటా అప్రమత్తత అవసరం

ఈ అగ్నిప్రమాదాల నివారణకు అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో బాణసంచా వ్యాపారాలు ఎక్కువ. ఆయా ప్రాంతాల్లో దుకాణాల వద్ద భద్రత ప్రమాణాలు నూరుశాతం అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కొత్తగా బాణసంచా గోదాములు, తయారీ కేంద్రాలకు అనుమతి ఇచ్చేప్పుడు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

భీమడోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలసానపల్లి గ్రామంలో ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడంతో దళిత సంఘాలు మండిపడ్డాయి. సోమవారం అంబేడ్కర్ జయంతి జరుగనున్న నేపథ్యంలో పోలసానపల్లి రహదారి పక్కనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై గుర్తుతెలియని వ్యక్తులు చెప్పుల దండ వేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో సీఐ విల్సన్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్‌తో దర్యాప్తును వేగవంతం చేశారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే విగ్రహానికి అవమానం జరగడాన్ని పలు దళిత సంఘాలు ఖండించాయి. రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించాయి. నిదితులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. దళిత సంఘ నేతలు సంతోష్‌కుమార్‌తో పాటు స్థానిక నేతలు ప్రత్తి మదన్, యుగంధర్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


పోలసానపల్లి రహదారిపై దళిత సంఘాల నాయకుల ధర్నా

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ వ్యక్తి పురుగుల మందుతాగి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు దుగ్గిరాలలోని జోసఫ్ నగర్‌కు చెందిన దాసరి మణిరాజు(44) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల పదో తేదీ సాయంత్రం తన ఇంటి వద్ద పురుగుల మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంతంగి ఉమాశిరీషా(23) జీఎన్‌ఎం చదివి ఏలూరు రామచంద్రరావుపేటలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమించాలంటూ ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తారస్థాయికి చేరడంతో యువతి ఈనెల 11వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను తల్లిదండ్రులు ధర్మాజీగూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. ఆదివారం యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. యువతి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

దామరచర్లలో వివాదం

- కర్రలతో కొట్టుకున్న ఇరువర్గాలు
- ముగ్గురికి తీవ్ర గాయాలు.. కానిస్టేబుల్‌కు చెయ్యి విరిగింది
- పోలీసు పికెట్ ఏర్పాటు.. పర్యవేక్షిస్తున్న పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు


గాయపడిన దుర్గయ్య

కుక్కునూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య తలెత్తిన చిన్న వివాదం పెద్ద కొట్లాటకు దారి తీసింది. ఇరువర్గాలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు పికెట్ ఏర్పాటు చేయగా పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణ జరిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. శనివారం రాత్రి దామరచర్లలో రహదారి పక్కన ఉన్న ఓ బడ్డీకొట్టు సమీపంలో రెండు సామాజిక వర్గాల యువకుల మధ్య చిన్న గొడవ తలెత్తింది. ఈ క్రమంలో ఒక యువకునిపై దాడి జరిగింది. ఈమేరకు రెండువైపులా ఆయా సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు వచ్చి ఘర్షణ పడ్డారు. అనంతరం కర్రలతో కొట్టుకున్నారు. అనంతరం గ్రామపెద్దలు జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమనిగింది. ఆదివారం ఉదయం గ్రామంలోని ఒక పెద్దమనిషి దగ్గర ఇరు సామాజిక వర్గాల పెద్దలు రాజీ చేసుకున్నారు.

ఆదివారం మధ్యాహ్నం మరోసారి సమీప గ్రామంలో రెండు సామాజిక వర్గాల వ్యక్తులు తారసపడి పరస్పరం దూషించుకున్నారు. ఈ గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తి పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. పోలీసులు చెల్లాచెదురు చేస్తున్నప్పటికి కొట్టుకుంటూనే ఉన్నారు. ఈ దాడిలో ఎస్.ప్రసాద్, దుర్గయ్య, సతీశ్ అనే ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే సమయంలో ముడియం శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ కొట్లాడుకుంటున్నవారిని చెల్లాచెదురు చేస్తూ కింద పడడంతో చెయ్యి విరిగింది. అనంతరం వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం సమీప అమరవరం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సీఐ రమేశ్‌బాబు, ఎస్‌ఐ రామకృష్ణ, కుక్కునూరు, వేలేరుపాడు పోలీస్ సిబ్బంది గ్రామంలో పర్యవేక్షిస్తూ వేలేరుపాడు పోలీసులు గ్రామంలో పహారా కాస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రాజు

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా శాఖ అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్‌రాజు అన్నారు. ఆదివారం ఏలూరు సంఘ భవనంలో ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదోన్నతుల విషయంలో పోస్టులు కేటాయించిన తరువాత ఫీడర్ కోటాలు సమావేశం అనంతరం ఏర్పాటు చేసేలా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 35ను ఎటువంటి సమాచారం లేకుండా విడుదల చేయడం జిల్లా, మండల పరిషత్, ఇంజనీరింగ్ డివిజన్‌లో ఏవోల పదోన్నతులతో తీవ్ర అన్యాయం చేసేలా ఉన్న 34శాతం కోటాను ఇచ్చారన్నారు. నూతన సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవో పోస్టు నియామకం రద్దు వల్ల కనీసం 50 శాతానికి పెంచకుండా చేయడం సరికాదన్నారు. తక్షణమే జీవోను సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి చుక్కా గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పెళ్లైన మూడు నెలల్లోపే..

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

పాలకోడేరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని మూడు నెలలు కాలేదు. ఇద్దరి మధ్య ఏమైందో ఏమోగాని భర్త కాసాని నానిబాబు ఇంటి ముందు భార్య ధర్నా చేసిన సంఘటన ఆదివారం గొల్లలకోడేరు గ్రామంలోని ఒకటో వార్డులో జరిగింది. గొల్లలకోడేరుకు చెందిన కాసాని నానిబాబు పాలకోడేరు గ్రామానికి చెందిన గౌరీ అనే యువతి పాలకోడేరులోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తూ ప్రేమించుకున్నారు. ఆపై గొడవల మధ్య వీరి వివాహం పెద్దల సమక్షంలోనే జరిగింది. వివాహమైన రెండు నెలల తర్వాత నానిబాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పాలకోడేరు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. కొన్నిరోజుల తర్వాత నానిబాబు ఇంటికి తిరిగి వచ్చేశాడు. అలా వీరి బంధం సాగుతుంది. మళ్లీ ఏమైందో తెలియదుగాని, భార్య గౌరీని నానిబాబు కుటుంబ సభ్యులు పుట్టింటికి పంపించివేయడంతో ఆమె తన భర్త తనకు కావాలంటూ భర్త ఇంటి ముందు కూర్చొని ధర్నా చేసింది. తన భర్తను తన వద్దకు పంపించాలని ఆందోళన చేపట్టింది. దీనిపై పాలకోడేరు పోలీసులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వారు ఎప్పుడూ గొడవలు పడుతూనే ఉంటారని, దీనిపై మిస్సింగ్ కేసు కూడా నమోదైందని, మళ్లీ అతడు తిరిగి వచ్చేశాడని, అయితే ఇంటి ముందు ధర్నా చేసిన విషయం తమ వద్దకు రాలేదని రైటర్ నాగరాజు తెలిపారు.


భర్త ఇంటి ముందు భార్య గౌరి ఆందోళన

తడికలపూడిలో నేడు శ్రీరామ జపయజ్ఞం

కామవరపుకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని గాంగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం శ్రీరామ జపయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సమితి సభ్యులు అత్యం వెంకటేశ్వరరావు, వంగపండు శ్రీనివాసరావు, చెలికాని భాస్కరరావులు తెలిపారు. గోపూజ, పూర్ణాహుతి నిర్వహించి కొంత ఊరు షణ్ముఖ పీఠం స్కంద స్వామిజీ ప్రసంగాన్ని తెలియజేస్తారని తెలిపారు. దేశ ధర్మాలు, దేవాలయాల రక్షణ కోసం సంకల్పించే ఈ యజ్ఞంలో అంతా పాల్గొనాలని, స్వామి ఆశీస్సులు పొందాలని వారు పిలుపునిచ్చారు.

రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రం

కామవరపుకోట : రావికంపాడులో తొమ్మిదో తరగతి చదువుతున్న మదిని జెస్సీ అనే విద్యార్థిని రావి ఆకుపై అంబేడ్కర్ చిత్రాన్ని వేసి తన ప్రతిభను ప్రదర్శించింది. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని రూపొందించినట్టు విద్యార్థిని తెలిపింది.



అమ్మపాలెంలో లయన్స్ క్లబ్ వైద్య శిబిరం

దెందులూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. ఆదివారం అమ్మపాలెంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని పూర్వపు జిల్లా గవర్నర్ ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పి.విజయ భాస్కర్ రెడ్డి, గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రసన్న కుమార్‌లతో కలిసి వైద్య శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 142 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలపతిరావు, పూర్వపు గవర్నర్ వేమా కోటేశ్వరరావు, శ్రీహరి, ఎల్.వెంకటేశ్వరరావు, వి.విష్ణుకుమార్, రీజియన్ చైర్మన్ వి.రత్నకుమార్, కార్యదర్శి కె.బాలకృష్ణలతో పాటు సూర్యమోటార్స్ అధినేత కృష్ణారావు పాల్గొన్నారు.

16న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 16న హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైఎంహెచ్ఏ ప్రాంగణంలో కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లుకు గౌరవ సత్కారం, నటులు ఎం.సూర్యనారాయణ, జానపద కళాకారులు ఎం.శేఖర్ బాబు, వాయిద్య, భజన కళాకారులు పి.సాయిబాబు, ఎ.భవానికి గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ తరపున సత్కరిస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు కార్యదర్శి జి.రాజేశ్, కోశాధికారి కె.వి.సుబ్బారావు తెలిపారు.

టీడీపీ నూతన సభ్యత్వ కార్డుల అందజేత



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు

టి.నర్సాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో టీడీపీ సభ్యత్వ కార్డులను ఆదివారం పంపిణీ చేశారు. సభ్యత్వం కలిగిన కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం తెలుగు యువత అధ్యక్షుడు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, గండబోయిన శ్రీను, గండబోయిన వెంకట్రావు, కాల్నిడి వెంకటరత్నం, వాసు, సాధనాల బుజ్జిబాబు, సూర్యనారాయణ, చిలకా సుబ్బు, సిద్ధా శ్రీను, ఈశ్వరాచారి, బొల్లు వెంకటేశ్వరరావు, సతీశ్, బచ్చల వెంకట రత్నం, శ్రీను, వర్మ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం నమోదు చేపట్టినట్టు జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దాసరి గణేశ్ బాబు తెలిపారు. ప్రతి శనివారం ఏలూరు టీటీడీ కల్యాణ మడపం ఎదురుగా ఉన్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో నమోదు చేస్తామన్నారు. 70 ఏళ్లు నిండిన వృద్ధులకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. ఆయూష్మాన్ కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోవడానికి 99890 14238 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా అన్న ప్రసాద వితరణ

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : గాంధీ నగర్‌లోని రామ మందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్న ప్రసాద వితరణను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నివేదనలు సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణను కమిటీ సభ్యులు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.

ప్రభుత్వ రిటైర్డ్ డ్రైవర్లకు ఘనంగా సత్కారం



రిటైర్డ్ ప్రభుత్వ డ్రైవర్లను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘ భవనంలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని, తక్షణం ఐఆర్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.వి.శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు ఈశ్వరరావు, మణికంఠ, వై.జి.ఎల్.నారాయణ, వై.నాగరాజు, డి.వేణు గోపాల్ స్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : శనివారపుపేట జింగిల్ బెల్స్ పాఠశాల వార్షికోత్సవం, యూకేజీ కాన్వొకేషన్ ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. విద్య పేదరికాన్ని దూరం చేస్తుందని, ప్రతీ ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంద ర్భంగా చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ సురేశ్ కుమార్, ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి అంబేడ్కర్ పురస్కారం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంఘం ప్రకటించిన డాక్టర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఉపాధ్యాయుడు జి.కృష్ణ అందుకున్నారు. ఏలూరు రూరల్ మండలం ఇందిరాకాలనీ ఎంపీయూపీ స్కూల్లో పని చేస్తున్న ఆయన ఆదివారం గుంటూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎస్సీ ఎల్టీవో అధ్యక్షుడు పి.నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన సంఘం కార్యవర్గ ప్రతినిధులు

జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం(ఏపీజీజేఎల్ఏ) ఏలూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగాయి. మూడేళ్ల కాలవ్యవధి(2025-28)కిగాను వివిధ కార్యవర్గ పదవులకు జిల్లాలోని ఆయా ప్రభుత్వ కళాశాలల నుంచి అధ్యాపకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా జి.భక్తహనుమాన్(జంగారెడ్డిగూడెం), ఉపాధ్యక్షుడిగా షేక్ ఖాసింపీర్ (కుక్కునూరు), కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు(ఏలూరు), సంయుక్త కార్యదర్శిగా కె.కె.ఎస్.జనార్దనరావు(ఏలూరు), కోశాధికారిగా కె.సమత(పెదపాడు), మహిళా కార్యదర్శిగా బి.ప్రమీల(పెదపాడు), స్టేట్ కౌన్సిలర్‌గా డాక్టర్ బి.వి.శ్రీనివాస్ (నారాయణపురం)లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘ కృష్ణా జిల్లా కార్యదర్శి జి.సందీప్, పరిశీలకునిగా సంఘ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎ.మురళీకృష్ణ వ్యవహరించారు. ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గానికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

సైబర్ వలకు చిక్కితే ఖాతా ఖాళీ



అమాయకులే టార్గెట్‌గా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

స్మార్ట్ ఫోన్ వినియోగదారుల్లో కలవరం

అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసుల సూచనలు

లింగపాలెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సామాన్యుడి నుంచి ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు. గేమ్స్, సినిమాలు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, నగదు చెల్లింపులంటూ అనేక రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం ప్రతి ఒక్కరికీ అలవాటుగా మారింది. ఇలా అన్నింటికీ స్మార్ట్ ఫోన్లు వినియోగించడంతో సైబర్ నేరగాళ్లకు అడ్డాగా మారింది. సైబర్ నేరగాళ్లు అమాయకులను రోజుకో రకంగా దోచుకుంటున్నారు. అమాయకులు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా ఎంచుకుని లాటరీల పేరుతో బ్యాంక్ వివరాలు తెలుసుకుని ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇటీవల కాలంలో అధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త రకం దోపిడీలకు తెరతీశారు. పండుగల పేరుతో గ్రీటింగ్‌లు సులువుగా పంపవచ్చంటూ వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లోకి చేరి పీఎం కిసాన్, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల పేరుతో మాల్‌వేర్ లింకులను పంపిస్తున్నారు. ఎవరైనా వాటిని క్లిక్ చేస్తే చాలు వారి బ్యాంక్ ఖాతాల్లో నగదును కొల్లగొడుతున్నారు. పొరపాటున నగదు పంపించామని, సీబీఐ అధికారులు, పోలీసు అధికారులమంటూ డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను బెదిరించి డబ్బు కాజేస్తున్నారు. లింగపాలెం మండలంలో గతంలో ఒక మహిళ వద్ద సైబర్ నేరగాళ్లు లక్షల రూపాయలు కాజేశారు. జంగారెడ్డిగూడెంలో ఓ జ్యూస్ సెంటర్ వ్యాపారి నుంచి 25వేలు లాగేశారు. ఇటీవల లింగపాలెం మండలంతో పాటు పక్కనే ఉన్న చింతలపూడి, జంగారెడ్డిగూడెం మండలాలలో ఇటువంటి ఘటనలు అనేకం జరిగాయి.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం



ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎవరికైనా అపరిచిత వ్యక్తుల నుంచి మోసపూరిత ఫోన్‌కాల్స్, లింక్స్ వచ్చినా ఓపెన్ చేయొద్దు. సైబర్ మోసగాళ్ల వలలో పడినా వెంటనే టోల్ ఫ్రీనెంబర్ (1930) లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వెంటనే స్పందిస్తే వారి డబ్బు వెనక్కి వచ్చేలా చేసే అవకాశం ఉంటుంది.

యు.రవిచంద్ర, డీఎస్పీ, జంగారెడ్డిగూడెం



లింగపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు



తడికలపూడిలో ర్యాలీలో పాల్గొన్న ఫాదర్‌లు



చింతలపూడిలో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆదివారం

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

పెదపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : పాత పెదపాడు, కొత్తపెదపాడు పరిధిలోని సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్‌లు సాల్మన్, పి.బాబూరావు ఆధ్వర్యంలో క్రీస్తు నామాన్ని స్మరిస్తూ కీర్తనలు పాడారు. పాతూరు, వడ్డీగూడెం, వెంకటపురం, పునుకోల్లు, గుడిపాడు, పాతముప్పర్రు, కొత్త ముప్పర్రు, అందేఖాన్ చెరువుతో పాటు పలు గ్రామాల్లో మట్ల ఆదివారం వేడుకలు నిర్వహించారు.

● బుట్టాయగూడెం : స్థానిక సెయింట్ మార్క్సు లూథరన్ దేవాలయంలో పాస్టర్ ఎం.ఎ.ఆమెన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఈతమట్టలను చేతపట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. సిలువ వేయడానికి ముందు జెరూషలేముకు వచ్చినప్పుడు అక్కడివారు ఏసుకు మట్టలు, వస్త్రాలు రోడ్డుపై పరుస్తూ ఘన స్వాగతం పలికారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టరమ్మ రెవ.మణికాంతమణి, గౌరధ్యక్షుడు యు.సూర్యప్రకాశరావు, డెలిగేట్ కె.విమల, సహాయ డెలిగేట్ బి.పద్మమాలిని, కోశాధికారి జి.ప్రసాద్, ఎం.ఆనంద్ పాల్గొన్నారు.

● దెందులూరు : పాస్టర్లు ఎన్ జ్ఞానరత్నం, రాజేశ్ ఆధ్వర్యంలో గోపన్నపాలెం పరిధిలోని వేగవరంలో గ్రేస్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో షాల్వేషన్ ఆర్మీ, బైబిల్ మిషన్, ఆర్‌సీఎం, పెంతెకోస్తు, సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్లు ర్యాలీ నిర్వహించారు.

● ద్వారకాతిరుమల : రాళ్లకుంట గ్రామ పరిధిలోని దొరసానిపాడులో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. నిత్య సహాయ మాత దేవాలయంలో ఫాదర్ ఇ.జీవరత్నం ఆధ్వర్యంలో మట్టలను చేతపట్టుకుని ర్యాలీ అనంతరం దివ్యబలి పూజను సమర్పించారు.

● జంగారెడ్డిగూడెం :పట్టణంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, క్రైస్ట్ లూథరన్ చర్చిలో విశ్వాసులు మట్టలకు పూలతో అలంకరించి ఆయా చర్చిల నుంచి ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కల్యాణ్ కుమార్, సీఎస్ఐ మెయిన్ చర్చి పాస్టర్ పిన్నిబాబు, క్రైస్ట్ లూథరన్ చర్చి పాస్టర్ జి.రమేశ్ బాబు, సెంట్ జాన్స్ పాఠశాల యాజమాన్యం సిస్టర్ అమలారాణి, నిర్మలా ఆసుపత్రి సూపరిండెంటెంట్ బిందు ఫిలిప్ పాల్గొన్నారు.

● కామవరపుకోట : తడికలపూడిలో లూర్దుమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ దోమతోటి నతానియేలు, నెల్లి జార్జి, చుట్టుమాల బాలస్వామి, మేరుగు సుందరరావు బృందం ఆధ్వర్యంలో గ్రామంలో మట్టలతో ప్రదర్శన జరిపారు. పలు సెంటర్లలో ఈ సందర్భంగా ఫాదర్స్ క్రైస్తవ సందేశాలను అందచేశారు.

● పోలవరం : పోలవరం, యడ్లగూడెం, ప్రగడపల్లి, బంగారమ్మపేట, కమ్మరగూడెం, కృష్ణారావుపేట, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల, రేపల్లెవాడ, కచేరి, పైడిపాక గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

● చింతలపూడి : చింతలపూడిలోని బోయగూడెం సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చి నుంచి మెయిన్ రోడ్డుపై ప్రధాన వీధుల్లో మట్టలతో భక్తులు ఊరేగారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి పాస్టర్ రవికాంత్, సంఘ కాపరి బి.వి.రాజశేఖర్, ఆశీర్వాదం, రాజేంద్ర పాల్గొన్నారు.

● లింగపాలెం : స్థానిక జూబ్లీ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎన్.జె.ఎం.కుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకను ఘనంగా నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకి వారం రోజుల ముందు క్రీస్తు యేరుషలేము నగరానికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని మట్టల ఆదివారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీ అనంతరం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సోలార్‌తో బిల్లులు ఆదా

ఏలూరురూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ఇంటింటా సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కరెంటు బిల్లుల ఆదాతో పాటు ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్ విక్రయించడం ద్వారా ఆదా యం, మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ సాల్మన్‌రాజు తెలిపారు. ఆదివారం ఏలూరు టెల్ టవర్స్ సోలార్ సంస్థ రాజు ప్రీమియం సోలార్ ప్యానల్స్‌ను రూపొందించింది. దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పా టు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. భావిత రాలకు సోలార్ ఎంతో ఉపయోగక రమని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు.



సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

సుస్థిర పాలనే ధ్యేయం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ ఉపయోగపడేలా సుస్థిర పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సూపర్ - 6 పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. వేసవిలో రెండు పూటలా తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో ప్రజాసమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో టి.రాజేశ్, మారం హనుమంతరావు, చిరంజీవి, సీహెచ్.శివరామకృష్ణ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

భూమన ప్రచారంపై టీడీపీ ఆగ్రహం

చింతలపూడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ గోమరణాలపై భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారంటూ నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోశాలలో వందల ఆవులు చనిపోయాయంటూ చేసిన ప్రకటన అవాస్తవమన్నారు. గోశాలలో 260 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తూ గోసంరక్షణను సక్రమంగా చూసుకుంటున్నారని అన్నారు. విద్వేషాలు రెచ్చగొడుతున్న ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేసిన వారిలో టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంపిటిసి కె.రాజారెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, అట్లూరి శ్రీనివాసరావు, మాటూరి వెంకట్రామయ్య ఉన్నారు.



వాసుబాబును సన్మానిస్తున్న అభిమానులు

వైసీపీ పొలిటికల్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా పుప్పాల వాసుబాబు

నిడమర్రు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : వైసీపీ పీఏసీ పొలిటికల్ ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్‌చార్జి పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) ఎంపికవడం పట్ల వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆదివారం భువ్వనపల్లిలో వాసుబాబు క్యాంపు కార్యాలయంలో వైసీపీ శ్రేణులు ఆయనను ఘనంగా సత్కరించాయి.అనంతరం వాసుబాబు మాట్లాడుతూ వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పుప్పాల చినబాబు, పుప్పాల కన్నబాబు, సంకు సత్యకుమార్ పాల్గొన్నారు.



ఉత్సవ నిర్వాహకులతో పోలీసులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పోలవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని పోలవరం సీఐ బాల సురేశ్ బాబు సూచించారు. ఆదివారం పోలవరం మండలంలో అంబేడ్కర్ విగ్రహాలను పరిశీలించి జయంతి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఎస్ఐ పవన్ కుమార్, రైటర్ శ్రీనివాస్, కోటి నవ చైతన్య అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఈర్నాల జాన్, కవల గంగాధర్, రాపాక వెంకటేశ్వరరావు, బచ్చల ముత్యాలు, రాపాక గోపి పాల్గొన్నారు.

విగ్రహాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు...

జంగారెడ్డిగూడెం : అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని పలు సమస్యాత్మక ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్.ఐ. ఎస్.కె. జబీర్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీ పేట, ఆర్టీసీ బస్టాండు వద్ద, ఉప్పలమెట్ట, డాంగేనగర్, మూడు, నాలుగు, ఐదు సచివాలయాల పరిధిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద, మండలంలోని వేగవరం, జొన్నవారిగూడెం, తాడువాయి గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ స్వచ్ఛ భారత్..

భీమడోలు : సూరప్పగూడెంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా బీజేపీ నాయకులు ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. బీజేపీ ఏలూరు జిల్లా సెక్రటరీ మామిడిపల్లి కృష్ణకుమారి ఆధ్వర్యంలో సూరప్పగూడెం దళిత కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి విగ్రహాన్ని శుద్ధి చేసి దీపాలను వెలిగించారు.

డీఐజీని కలిసిన ఎమ్మెల్యే సొంగా రోషన్

చింతలపూడి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆదివారం ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతి భద్రత, ట్రాఫిక్ సమస్యలపై డీఐజీతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు జె.ముత్తా రెడ్డి, కె.రాజారెడ్డి, చలపతిరావు పాల్గొన్నారు.



డీఐజీకి మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం తెస్తాం : ఘంటా



మహాజన సభలో మాట్లాడుతున్న ఘంటా మురళీ

కామవరపుకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : జి.హెచ్.ఆర్. ఎత్తిపోతల పథకం సభ్యుల మహాజన సభను ఆదివారం కామవరపుకోటలోని సంఘ కార్యాలయం వద్ద చైర్మన్ కంఠమనేని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సహకారంతో స్కీంకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. సంఘ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులంతా సకాలంలో నీటి తీరువా చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంఘాన్ని రద్దు చేయడంతో సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో స్కీం కుంటుపడిందన్నారు. టీడీపీ ప్రభుత్వ చొరవతో పునరుద్ధరించినట్టు తెలిపారు. తొలుత సంఘ డైరెక్టర్ సత్యనారాయణ ఆడిట్ రిపోర్టును మహాసభలో ప్రవేశపెట్టారు. సుదీర్ఘ కాలంగా స్కీంకు సేవలందిస్తున్న మేనేజర్ సత్య నారాయణను స్కీం సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో బొప్పన సత్యనారాయణ, గోరింక దాసు, మండలపు కృష్ణారావు పాల్గొన్నారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ముస్లింల సమస్యలపై పోరాడుతాం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ఏపీ నూర్ బాషా(దూదేకుల) యువజన ముస్లిం సంక్షేమ సంఘ నియోజకవర్గ యూత్ అధ్యక్షునిగా మండలంలోని దేవినేనివారి గూడేనికి చెందిన షేక్ ఇస్మాయిల్‌ను నియమించారు. గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాష్ట్ర నూర్ బాషా యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇస్మాయిల్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు డి.పి.మస్తాన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై సకాలంలో స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

గుండె పోటుతో ఎంపీటీసీ మృతి

టి.నర్సాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామ వరం గ్రామానికి చెందిన ఏపిగుంట పంచాయతీ వైసీపీ ఎంపీటీసీ నులకాని నరసింహరావు(60) శని వారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నెలరోజుల క్రితం అస్వస్తతకు గురికావడంతో ఆయన్ని విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో స్టంట్ మార్చారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటి వద్దనే మరోసారి గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి మండలంలోని వైసీపీ, టీడీపీ, జనసేనకు చెందిన పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

18న సర్వోదయ పురస్కారాలు

ఉంగుటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : సర్వోదయ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామ సర్వోదయ స్థూపం వద్ద పలు కార్యక్రమాలు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.

కైకరంలో శివాలయ పునః ప్రతిష్ఠ

ఉంగుటూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైకరం శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరాయం పునఃప్రతిష్ఠలో భాగంగా ఆదివారం పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : రాట్నాల కుంట శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లలో రెండోరోజు ఆదివారం ఉదయం 6గంటలకు విఘ్నేశ్వర పూజ, నవగ్రహ మండపార్చన, పరివార దేవతార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. శ్రీరాట్నాలమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7 గంటలకు అమ్మవారికి ఏలూరు ఉండవల్లి కనస్ట్రక్షన్ సౌజన్యంతో నిర్వహించిన పుష్పయాగం భక్తులను కట్టిపడేసింది. రెండో రోజు ఆదివారం శ్రీరాట్నాలమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఎమ్మెల్యే చింతమనేని పూజలు..

దెందులూరు : రాట్నాలమ్మ ఆశీస్సులు అందరిపైనా ఉంటాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.ఆదివారం పెదవేగి మండలం రాట్నాలకుంటలో నిర్వహిస్తున్న వార్షిక తిరునాళ్లను పురస్కరించుకుని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ మన్నే బాబూరావు, కమిటీ స భ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బొప్పన సుధా, క్లస్టర్ ఇంచార్జీ మంచినేని శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ కార్యనిర్వాహక అధికారి నల్లూరి సతీశ్ కుమార్, సూపరిం టెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉప్పుగూడెంలో విగ్రహ ప్రతిష్ఠ..

సోమవర ప్పాడు పంచాయతీ పరిధిలోని ఉప్పుగూడెం గ్రామంలోని కోదండ రామ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌తో కలిసి చింతమనేని ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో సామూహికంగా స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆదిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, మిత్ర బృందం తగిన ఏర్పాట్లు చేశారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

పేదలకు లయన్స్ సేవలు

నిడమర్రు ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : పేదలకు విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సేవలందిచడానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ లయన్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి భువ్వనపల్లిలో లయన్స్ క్లబ్ ఆఫ్ గణపవరం గవర్నర్ పర్యటన కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొని సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట రోడ్డులోని శ్రీరామచంద్ర జూనియర్ కళాశాలలో ఫార్మా కంపెనీల జాబ్ మేళా నిర్వహించడం పట్ల డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు విద్యా సంస్థల చైర్మన్ బి.వి.కృష్ణారావును అభినందించారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 210 మంది అభ్యర్థులు హాజరైన కృష్ణారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు రెండు రోజుల్లో ప్రకటిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగంగా ఉన్న ఆవకూరు వంతెన

13 ఏళ్లుగా..

అప్రోచ్ రోడ్డు లేక అసంపూర్తిగా ఆవకూరు వంతెన

కలిదిండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆవకూరులో పెదలంక డ్రెయిన్‌పై రూ.3 కోట్లతో సుమారు 13 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన వంతెన అసంపూర్తిగా ఉంది. వంతెనకు నేటికి అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. దీంతో పక్కనే ఉన్న శిథిలావస్థ వంతెనపై నుంచి వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన కిందకు కుంగింది. ఇరువైపులా రైలింగ్ విరిగి కిందకు వేలాడుతున్నాయి. ఏ క్షణంలో కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ వంతెనపై నుంచి కోరుకొల్లు, ఆవకూరు, కొచ్చెర్ల, ప్రొద్దువాక, చైతన్యపురం, దేవపూడి, కొత్తపల్లి, వైవాక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల్లో చేపల, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో మేతల లోడు లారీలు చెరువుల వద్దకు వెళ్లడానికి పాత వంతెనపై ఇబ్బందిగా ఉంది. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్నామని ఆక్వా రైతులు వాపోతున్నారు. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో కొత్త వంతెన నిర్మించినప్పటికీ అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయక పోవడంతో మళ్లీ పాత వంతెనపై నుంచి రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని, ఏ క్షణంలో కూలిపోతుం దోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని వాహనదారులు, ద్విచక్ర వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఆవకూరు వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని పాలకులకు, అధికారులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ అనిల్‌ను వివరణ కోరగా, ఆవకూరు వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్లు ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరు కాగానే అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు.



శిథిలావస్థలోని పాత వంతెన

ముదినేపల్లిలో రక్తదాన శిబిరం

ముదినేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ కాలనీలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జైభీమ్ యువసేన కైకలూరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, పలువురు యువకులు రక్తదానం చేశారు. జైభీమ్ యువసేన ప్రతినిధి మధిరి పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గుడివాడ ఏపిఎల్ అండ్ ఏఎస్ఆర్ హాస్పటల్ సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ అంబేడ్కర్ జయంతి కేక్ కట్ చేయగా, దళిత సంక్షేమ సంఘం నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బుంగా జోజి, పాగోలు విజయ సాగర్, గద్దె రాజు, గోనా దావీదు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో రక్తదానం చేస్తున్న ఏపీటీడీసీ డైరెక్టర్ కొడాలి వినోద్

అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీ నేతలు

మండవల్లి : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర బీజేపీ అధిష్ఠానం ఆదేశానుసారం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ సూచనతో బీజేపీ నాయకులు మండవల్లి, చావలిపాడు, లోకుముడి గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలను ఆదివారం శుభ్రం చేశారు. పార్టీ నాయకులు గుడివాడ చిట్టబాబు, గంగునేని వరప్రసాద్, మండల ఇన్చార్జి సమయం ఏసుబాబు, బండి దివాకర్, శ్రీనివాసరావు, తానంకి సాయి, మీరావళి, బుర్ల గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలి : సీఐ

కైకలూరు/ముదినేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ కోరారు. సోమవారం జరగనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల నిర్వహణపై ఆయన ఆదివారం కైకలూరు రూరల్ పోలీసుస్టేషన్లో విగ్రహాల కమిటీ సభ్యులకు, అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యులు, అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాల పర్య వేక్షణ ఉందన్నారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్ లోను వేడుకల నిర్వాహకులు, విగ్రహాల కమి టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు.



కైకలూరు సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్



సహజకవి దండే బెనర్జీని సత్కరిస్తున్న రచయితల సంఘం

సహజకవి బెనర్జీకి సత్కారం

కైకలూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో కైకలూరుకు చెందిన సహజకవి దండే బెనర్జీని ఆదివారం ఘనంగా సత్కరించారు. కోనసీమ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యం లో శ్రీశ్రీ కళావేదిక 147వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో బెనర్జీ 'ఉగాది లేవి... ఉషస్సులేవి' అనే శీర్షిక కవితను ఆలపించారు. కవులను ఆ కవిత ఆకట్టుకోవడంతో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లత, తదితరులు పాల్గొన్నారు.

కొల్లేటికోటలో పోటెత్తిన భక్తులు

కైకలూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పాలపొంగళ్లను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఈవో కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లును నిర్వహించి భక్తులకు ఉచితంగా మంచినీటి సుదపాయాన్ని కల్పించారు.



పెద్దింటి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం పెదపాలపర్రు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, 11 కేవీ చౌటపల్లి ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ పనుల నిర్వహణలో భాగంగా విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం పై ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఆక్వా, గృహాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలో లివర్ వ్యాధితో అనారోగ్యం పాలయి ఆదివారం మరణించిన ఆవుల వీరయ్య (25) అనే యువకుడి అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.ఐదు వేలు సహాయం అందజేశారు. వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ వీరయ్య కుటుంబాన్ని పరామర్శించి ఈ సహాయాన్ని అందజేశారు.



నూజివీడులో, చనుబండలో మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆదివారం

ముదినేపల్లి / కలిదిండి/నూజివీడు టౌన్/ చాట్రాయి/ఆగిరిపల్లి/మండవల్లి/కైకలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించా రు. ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కె.మరి యదాసు ఆధ్వర్యంలో క్రైస్తవులు, చిన్నారులు ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. లెమన్ ఇవాంజికల్ ఫెలోషిప్ చిన్నారులు, కొరగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం, వాడవల్లి, పెయ్యేరు, బొమ్మినంపాడు, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో ఫాదర్లు కటికల ప్రభుదాసు, ఉచ్చుల విజయకుమార్, గొర్ల పీటర్ తదితరుల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీలు జరిగాయి. కలిదిండిలో క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలతో ఏసుక్రీస్తుకు స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. భాస్కరావు పేటలో క్రైస్తవులు ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో గల చర్చిలలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దైవజనులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా క్రైస్తవ విశ్వాసులు ఈత మట్టలను చేతపట్టుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో పూలతో అలంకరించిన మట్టలను చేతబట్టి క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ పురవీధుల్లో ప్రదర్శనలు జరిపారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, తోటివారిని ప్రేమించాలని క్రీస్తు బోధించారని ఫాదర్స్, పాస్టర్స్ క్రైస్తవులకు సందేశం ఇచ్చారు. అనంతరం చర్చిలలో ప్రార్థనలు జరిగాయి. ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో పరిశుద్ధ పౌలు సీఎస్ ఐ దేవాలయంలో రెవరెండ్ కె.ఐజక్ జాన్ ఆధ్వ ర్యంలో మట్టల ఆదివారం నిర్వహించినారు. చిన్నా రులు, యువకులు ఉదయం నుంచే ఈత మట్టలను రంగుల పూలతో అలం కరించి వాటితో గ్రామ పురవీధుల్లో తిరిగారు. మండవల్లి గ్రామంలోని ఆర్సీఎం చర్చిలో రెవ రెండ్ ఫాదర్ శాంతరాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఏసుక్రీస్తు ప్రత్యేక ప్రార్థన లు చేశారు. అనంతరం ఎస్సీవాడలో ఏసుక్రీస్తు సువార్తను ప్రకటిస్తూ ర్యాలీ నిర్వహించారు. సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. కైకలూరు మండలంలో ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి గ్రామ వీధుల్లో మట్టలతో ఊరేగింపు చేశారు. వేలాదిమంది సువార్తకులు పాల్గొన్నారు. వరహాపట్నం సెంటర్లో చిన్నారులు నృత్యాలు చేస్తూ ఏసుప్రభు గీతాలను ఆలపించారు. ఆటపాక శివారు జాన్ పేటలో, కైకలూరు, భుజబలపట్నం, రాచపట్నం, పల్లెవాడ తదితర గ్రామాల్లోని తదితర చర్చిల్లో మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు.



మండవల్లిలో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసకులు



ఆగిరిపల్లిల్లిలో ప్రదర్శన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

భూమన వ్యాఖ్యలు ఖండించిన టీడీపీ నేతలు

కైకలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి గోశాలలో వందలాది ఆవులు మృతి చెందాయంటూ అసత్యపు ఆరోపణలను నియోజకవర్గ కోకన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఖండిం చారు. ఆదివారం కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అధ్యక్షతన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన భూమన కరుణాకరరెడ్డి ఆవులు మృతి చెందాయంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు మాల్యాద్రి, రత్నారావు, శ్రీనివాసరావు, కోకన్వీనర్లు విజయలక్ష్మీ, డీసీ చైర్మన్ వాసురాజు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చింతపాడు హైస్కూల్ పూర్వవిద్యార్థులకు సత్కారం

మండవల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జడ్పీ ఉన్నత పాఠశాల చింతపాడు పూర్వ విద్యార్థులు 2025 ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఘంటసాల యతీశ్వర్ వెయ్యి మార్కులు గాను 984మార్కులతో స్టేట్‌ర్యాంక్ సాధించగా, సైదు సుదర్శన్ 975, ఏలూరు ఇషాంత్ 971, ఘంటసాల పద్మావతి 931, జాహ్నవి 913, శ్రావణి 907 మార్కులతో ప్రతిభను కనబరిచారు. అప్పటి పదో తరగతి ఫలితాల్లోను వీరందరూ మంచి ఫలితాలు సాధించారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు చింతపాడు హైస్కూల్ ఆవరణలో ఆదివారం సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

కూల్‌కూల్‌గా ప్రయాణం

చాట్రాయి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో చిత్తపూరు- కొండపర్వ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు వేసవి కాలంలో ప్రయాణికులకు చల్లని నీడను ఇస్తున్నాయి. సుమారు అర కిలోమీటరు దూరం మేరకు రహదారికి ఇరువైపులా చెట్లు బాగా పెరిగి చివర్లు కలిసి పోయి గొడుగుల్లా తయారయ్యాయి. చాట్రాయి మండల ప్రజలు ఈ రహదారిలోనే నూజివీడు, విజయవాడ వెళ్తుంటారు. మండే ఎండ సమయంలో ద్విచక్రవాహనాలు, కార్లులో ప్రయాణించేవారు కొద్దిసేపు ఇక్కడ ఆగి సేదతీరి వెళుతున్నారు. ఇక్కడ చెట్లు ఇచ్చే చల్లదనాన్ని ప్రయాణికులు ఆస్వాదిస్తున్నారు.



చిత్తపూరు-కొండపర్వ మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

యువతి ఆత్మహత్యపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం. చిరంజీవి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పంతంగి ఉమాశిరీషా(23) జీఎన్ఎం చదివి ఏలూరు రామచంద్రరావుపేటలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. విసన్నపేట మండలం ముత్రాసుపాలెంకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు కొంతకాలంగా ప్రేమించాలంటూ ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తారస్థాయికి చేరడంతో యువతి ఈనెల 11వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను తల్లిదండ్రులు ధర్మాజీ గూడెం ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏ లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. ఆదివారం యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. యువతి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పట్టుదలతో ఇంటర్‌లో రాణించిన విద్యార్థినులు

నూజివీడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : విధి చిన్నచూపు చూసినా పట్టుద లతో చదువులో ముందడుగు వేశారు నూజివీడు స్నేహారైడ్స్ చిన్నారులు. వివరాలివి.. నూజివీడు స్నేహారైడ్స్‌లో వసతి పొందుతున్న శైలజ, హరిత ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలను సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయి వీధి నాటకాలు చేస్తూ, యాచిస్తూ ఉన్న శైలజను గుర్తించిన ఉమెన్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ఆమె సంరక్షణ బాధ్యతను నూజివీడు స్నేహారైడ్స్‌కు అప్పగించారు. మరో విద్యార్థిని హరిత చిన్న వయసులో తల్లిని కోల్పోగా తండ్రి సైతం చిన్నారిని వదలి వెళ్లిపోయాడు. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ హరిత సంరక్షణ బాధ్యతను సైతం స్నేహారైడ్స్‌కు అప్పగించింది. వీరు నూజివీడులోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్ ఇదే హైస్కూల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించారు. ఇటీవల జరిగిన ఇంటర్ పరీక్షల్లో శైలజ 722/1000 మార్కులు సాధించగా, హరిత 634/1000 మార్కులు సాధించినట్టు స్నేహారైడ్స్ చైర్మన్ బసవరాజు నగేష్ ఆదివారం విలేకర్లకు తెలిపారు.



స్నేహారైడ్స్ విద్యార్థినులు

ఆగిన రోడ్డు నిర్మాణం..

అటవీ శాఖ అభ్యంతరాలతో తప్పని తిప్పలు

చాట్రాయి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో మూడు గ్రామాలకు వెళ్లే రహదారులలో ఫారెస్ట్ పరిధిలో ఉన్న చోట్ల బీటీ రోడ్ల నిర్మాణాన్ని అటవీశాఖ అడ్డుకోవడం వల్ల సరైన రహదారి లేక మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాట్రాయి-నరసింహారావుపాలెం మధ్య సుమారు ఒక కిలోమీటరు, తమ్మిలేరు ప్రాజెక్టు-పోతనపల్లి మధ్య సుమారు రెండు కిలో మీటర్లు, మంకొల్లు-చీపురుగూడెం మధ్య సుమారు ఒక కిలో మీటరు దూరం రహదారులు, తమ పరిధిలో ఉన్నాయని అటవీశాఖ పదిహేనేళ్ల క్రితం బీటీ రోడ్లు వేయకుండా అడ్డుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు అదే పరిస్థితి కొనసాగుతున్నది. ఎమ్మెల్యేలు, మంత్రులకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు. వర్షాకాలంలో ఈ రోడ్లలో పెద్దపెద్ద గుంతలు పడి బురదమయంగా మారి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ప్రజలకు నిత్యం అవసరమైన రోడ్ల నిర్మాణాన్ని నిబంధనల పేరుతో అడ్డుకోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించి సదరు రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



అటవీ ప్రాంతంలో ఉన్న రోడ్డు

నిత్యం ఇబ్బందులే



గోతుల రోడ్లలో ప్రయాణం చేయలేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్ల అభివృద్ధికి అటవీశాఖ అభ్యంతరాలు పెట్టడం దారుణం. ప్రభుత్వం స్పందించి అటవీశాఖ అభ్యంతరాలతో ఆగిన రోడ్లను పూర్తి చేయాలి.

ఎం.ప్రసాదరావు, చీపురుగూడెం

బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్చడమే లక్ష్యం

ముసునూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను మళ్లీ పాఠశాలల్లో చేర్పడమే లక్ష్యమని హెచ్‌ఎం పి.రామకృష్ణ అన్నారు. ఆదివారం రమణక్క పేటలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం బడిఈడు పిల్లలను గుర్తిండం, ఈ విద్యాసంవత్సరానికి విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అనేక ఉచిత సదుపాయాలను కల్పిస్తుందన్నారు. మూడు జత ల ఏకరూప దుస్తులు, పాఠ్యంశాల పుస్తకాలు, నోట్‌బుక్స్, షూలు ఉచితంగా ఇవ్వడంతోపాటు ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యాబోధన, కంప్యూటర్ విద్య, నెలకు ఒకసారి ఉచిత వైద్య పరీక్షలు, నూరుశాతం ఇంగ్లీష్ మీడియం అందిస్తున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. బడిఈడు పిల్లలను కలిసి వారిని పాఠశాలలో చేర్చేందుకు అడ్మిషన్‌లు ఇచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రియదర్శిని, కాశీ అన్నపూర్ణ పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న దృశ్యం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



బాకీల జాబితా కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

నీటి తీరువా బకాయిలు కంప్యూటరీకరణ చేయాలి

కలిదిండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నీటి తీరువా బకాయిల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మూడేళ్లుగా నీటి తీరువా వసూళ్ల చేయకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయన్నారు. పట్టాదారులను గుర్తించి డేటా ఎంట్రీ చేసి నీటి తీరువా పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముమ్మరంగా పెదలంక కాల్వ పూడికతీత పనులు

కలిదిండి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెదలంక - మూల్లంక కాల్వ పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెత్తాచెదారంతో పూడుకుపోవడంతో నీటి పారుదలకు అడ్డంకిగా మారింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు కాల్వ పూడికతీత పనులకు చర్యలు తీసుకున్నారు. వారం రోజులుగా కాల్వలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. పెదలంక నుంచి ఐదు కిలోమీటర్ల మేర కాల్వలో మట్టితో పాటు ఇరువైపులా ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగిస్తున్నారు. ఈ నెల 15న కాల్వలకు తాగునీరు విడుదల చేస్తుండడంతో కాల్వ తవ్వకం పనులు వేగవంతం చేశామని ఇరిగేషన్ ఏఈఈ ఫణి కుమార్ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్ లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్టలో పాలు పోసి, పాల పొంగళ్లతో సుబ్రహ్మణ్యేశ్వరుడికి మొక్కులు తీర్చుకున్నారు. నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు తొలేటి వీరభద్రరావు, రుద్రపాక బాలగంగాధర తిలక్ పూజలు నిర్వహించారు.



గరుడ వాహనంపై గ్రామోత్సవం దృశ్యం

సీతారాముల గ్రామోత్సవం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలం దిగవల్లి గ్రామంలోని సీతారామస్వామి వార్లకు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీరామ నవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ, కల్యాణ మహోత్సవ అనంతరం స్వామివార్లకు గరుడ వాహనంపై గ్రామోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కేంద్ర పథకాలపై ప్రచారం

చాట్రాయి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళల సంక్షేమానికి అర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, బజ్జూరి గోపాలకృష్ణ, విద్యాధరరెడ్డి అన్నారు. మండలంలోని చనుబండలో ఆదివారం పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటిం టికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

మూగజీవాలు విలవిల

చాట్రాయి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తీవ్రమైన ఎండలకు తట్టుకోలేక మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. పశువులు, మేకలు, గొర్రెలు నీడ కన్పిస్తే చెట్ల కిందకు పరుగుతీస్తున్నాయి. మూగజీవాలను కాయడానికి, వాటికి తాగునీరు అందించేందుకు పోషకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూగజీవాలకు గ్రాసం కొరత ఉందని, మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు ఇబ్బందులు తప్పవని పోషకులు వాపోతున్నారు.



చెట్టు కింద సేదతీరుతున్న జీవాలు